కథానిక

# చర్విత చర్వణం

వి. శార్వరి

క్రిష్టుడు బలువుగా వూపిరి వొదిలాడు. బరువు భారంవల్ల రాలిన కన్నీటి చుక్కలను వేలితో తుడుచుకుని ఆలోచిస్తూ కూచున్నాడు. వికలమైన మనస్సు. కన్నీటి చెమ్మవల్ల. పేపరు లోని పంక్తులన్నీ అలికినట్టుగావున్నయ్. పాపం! కిష్టుడు అలా నిరాశపట్టానికి అదే మొదటిరోజు కాదు, అనేక దినాలు దొర్లినయ్ కాలగమనంలో. కాని కాలానికి ఎదురీత ఎంతకాలం సాగుతుంది? అయినా తప్పదు మానవుడి ప్రయత్నం. రోజూ ఉద్యోగాలకు ఖాళీలు అన్న భాగాన్ని ఆశగా రెండుమూడు సార్లు చదువుతాడు. నిరాశతో నిట్టూరుస్తాడు. ప్రపంచంలో అదృష్టహీనుడు అతనొక్కడే అతని దృష్టిలో నిజంగా అతని అభిప్రాయం ప్రకారం. అయితే ప్రపంచంలో తనెందుకు పుట్టాడు? అసలు తనలాంటి అసమర్థుణ్ని కన్నందుకు తలిదండ్రులు, ప్రాణంపోసిన భగవంతుడు ఆ విషయంలో దోషులే. విత్తనమూ, నీరూ ఎప్పుడూ ఒకేచోట వుండవు. ఆ రెండూ ఎప్పుడో ఎక్కడో తరుచు కలుస్తుంటాయి. ఆ కలిసినవే జీవిస్తాయి. కలవనివి అనేకం! ఎవరికి తెక్క!

కిష్టుడు చదివింది బి. ఏ. ఆమాటకొస్తే. కాని ఏమిటి లాభం. ఎందుకు చదివాడు బి. ఏ? ఎందుకు చదివించారు తనని? ఏం ఈ చదువులన్నీ చదవకపోతే, అసలు తనని పెద్దవాళ్లు చదవెయ్యకపోతే హాయిగా ఈపాటికి పొలంలో పనిచేసుకుంటూ బండి తోలుకుంటూ నిశ్చింతగా జీవించేవాడు గదా? ఇలాంటి బాధలు వుండేవే కాదుగదా? పెద్దపెద్ద చదువులు చదివి ఏదో వొరగపెడదా మనుకున్నాడు. అనే పెద్దవాళ్లు తన అభిప్రాయానికి అడ్డుగా లేదు నిజానికి. అందువల్లనే వున్న రెండున్నర ఎకరాల మాగాణి మాయమై బి. ఏ. రూపం దాల్చింది. కాని ఏం ప్రయోజనం? అయితే అది కేవలం కిష్టుడి లోపమేగాదు. కిష్టుడు కేవలం తెలివితక్కువవాడు, అసమర్థుడు ఏంకాదు. అతనికి వుద్యోగం రానంతమాత్రాన, జీవితం ఎడారిలో నడుస్తున్నంత మాత్రాన! ఆలెక్కకొస్తే దేశంలో ఎన్ని వేలమంది నిరుద్యోగులు, చదువరులు లేరుగనక? అంతా కిష్టుడిలాంటివాళ్లే ననుకోటం పొరపాటు. అనేక వేలమంది అనేకవేల ఉద్యోగాలు చేస్తున్నారు. చెయ్యనివాళ్ళ సంఖ్య, ఉద్యోగాల్లేక బాధలుపడుతున్నవారి సంఖ్య కూడా వేలల్లోనే వుంది. అయితే విశేషమేమంటే స్కూలు ఫైనలు మూడుసార్లు చెక్కబడ్డవాళ్లు కూడా నిక్షేపంగా వుద్యోగాలు చేస్తున్నారు. ఎటు తిరిగి ఏవుద్యోగంలేంది కిష్టుడు, కిష్టుడిలాంటి మరికొందరే మో!

కిష్టుడు చప్పున లేచి పచారు సాగించాడు. లైబ్రరీలో ప్రక్కగా తనలాంటివాళ్లే తనొదిలిన పేపర్కోసం తహతహలాట్టం చూస్తూ చూచాడు. పాపం! తనలాంటి అమాయకులు వాళ్లుకూడా! ఎంత ఆసక్తి. నిజంగా ఎంత ఆసక్తి లేకపోతే తను మొదటగా ఎందుకు చూచాడు! ఒకే క్షణంలో దేశంలో ఎంతమంది చదువరులు తనలాగా నిస్పృహ చెందుతున్నారో పాపం. అమాయక ప్రపంచం అర్రులు చాస్తోంది, తన లాంటివాళ్లకోసం! కిష్టుడు మెట్లుదిగుతూ బజారు వైపు చూచాడు, అన్నిరకాల మనుష్యులు, పోతున్నారు, వస్తున్నారు. వాళ్లంతా కూడా పనిలేనివాళ్లే మో కనిపిస్తోంది అతనికి. లేకపోతే బజార్లుపట్టుకు ఎందుకు తిరుగుతారట్లా?

పోతూపోతూ సిగరెట్ కోసం జేబులో చెయ్యి పెట్టుకున్నాడు. కాగితం తగిలింది. బైటకు తీసి చూచాడు. కిష్టుడి తల్లి కిష్టుడికి రాసింది. ఆ వుత్తరం యిదివరకు రెండుసార్లు చదివాడు, కాని ఏమిటో పక మూడోసారి చదవటం

ప్రారంభించాడు. "ఏమైనా పండక్కి ఇంటికి రా, అక్కాయి, బావా, నీకోసం ఎదురు చూస్తూన్నారు. ఈ వారంలో వుద్యోగం దొరుకుతుందని ఫర్వాలేదు. వచ్చే డబ్బు అల్లరి చిల్లరగా ఖర్చు పెట్టబోకు, బాబాయిగారింటో భోజనం చేస్తున్నందుకు కొంత యివ్వు, కొంత గుడ్డలకీ కొనుక్కునేందుకు వినియోగించుకో, పోతే అక్కాయికి మద్రాసు నుండి గాజులు తెస్తానన్నావట. తెగ మురిసిపోతోంది. వొచ్చేప్పుడు మంచి గాజులు అయిదారు కట్టుకురా. ముఖ్యవిషయం ఏమంటే వుద్యోగం దొరక్కపోతే విచారించకు మనిషిపుట్టాక బ్రతకక లేకపోడు. అయితే యిబ్బందులనేవి మానవులకు గాక మానులకొస్తాయా? జ్ఞాపకముంచుకో కష్టపడ్డవాడే ఫలాన్ననుభవిస్తాడు ఏనాటికైనా. కష్టాలు గట్టెక్కిన తరవాత తిరిగి రమ్మంటే వొస్తాయా కాయనా, కాబట్టి వుద్యోగం దొరకనందుకు విచారించబోకు. చదువుకొన్నవాడివి ఎక్కడయినా నాలుగు డబ్బులు గౌరవంగా సంపాదించుకో వచ్చు. మరేం ఫరవాలేదు. అంతగా పరిస్థితులు ప్రతికూలిస్తే యింటికొచ్చేయ్ ఇక్కడే ఎక్కడున్నా నాలుగురాళ్ళు ఎట్లాగో సంపాదించుకో వచ్చు అమ్మాయి గాజులు తేవటం మాత్రం మరచిపోకు, పిన్నీ వాళ్లను అడిగానని చెప్పు. ఇట్లు, అమ్మ"

అమ్మ రాసిన వుత్తరం చదువుకునేసరికి కిష్టుడికి ఏడుపొచ్చింది: కళ్లల్లో నీళ్లు తిరిగిన కారణాన దోవ కనిపించలేదు. ప్రక్కగా వున్న సిమెంటు బల్లమీద కూచున్నాడు ఆలోచిస్తో. నిజంగా ఆలోచించేదేం లేదు, ఆలోచించి తెలిసేదీ ఏంలేదు. అందుకనే అతను ఆలోచిస్తున్నా డనటంకన్నా బాధపడుతున్నా డనటం సమంజసం ఆ సమయంలో. ఎదురుగా వున్న ఆవరణలో మామిడిచెట్టు, తెల్లగా దోర మగ్గిన కాయలు కనిపించినయ్. ఎందుకో అవి తినాలనిపించింది. వెంటనే అమ్మ మాటలు జ్ఞాపకాని కొచ్చినయ్. 'కష్టపడ్డవాళ్లే ఫలం అనుభవిస్తారు ఏనాటికైనా!' అమ్మ ఎంత పొరపాటుబడింది. ఈ మామిడిచెట్టు ఎవరు వేసి వుంటారు. పెంచి వుంటారో? యిప్పుడు ఎవరు అనుభవిస్తున్నారు? ఎవరో కష్టపడి పెంచుకున్న చెట్టు కాయల్ని తాను అనుభవించ తలచటం ఎంత నీచం! అందుకనే మెల్లిగా బయలుదేరాడు.

దోవలో జ్ఞాపకం వొచ్చింది-ఓ చీరాలబజారు షావుకారు తనకు వుద్యోగం యిస్తానన్న సంగతి. వెంటనే చీరాలబజారు వేపు బయల్దేరాడు షావుకారును కలుసుకునేందుకు. షావుకారు షాపు దగ్గరకొస్తున్న కొలదీ కిష్టుడికి భయం ఎక్కువ కాసాగింది. గొంతు బొంగురు పడుతోంది. కాళ్లు వొణుకుతున్నయ్. ఆ షావుకారు తనకు వుద్యోగం యిస్తానని మాటయిచ్చాడు. ఆ మాట యివ్వటం షావుకారయితేగాని! కొట్లో వున్న పెద్ద గుమాస్తా. అతనెంత చెబితే అంత షావుకారు అందుకనే తను షావుకారు గుమాస్తాని, కాబోయే మానేజర్ని కాఫీ పరిచయం చేసుకున్నాడు. దాంతోనే మర్యాద చేస్తుంటాడు యిప్పటికీ.

కిష్టుడు కనిపించగానే గుమాస్తా ఎదురుగా వొచ్చి 'రాండి, రాండి' అన్నాడు. అతని మాటల్లో కిష్టుడికి ఆశ ఏకోణంనుంచో కనిపించింది. 'ఆశలేని మానవకన్ను లుంటారంట' లెండి. గుమాస్తా పొట్టాడి మారు ఎల్లుండి రాండి, లేటు తుంది. త్రొంభయి తొమ్మిది పాళ్ళు మిమల్నే పెట్టుకునేట్టు చూస్తానన్నాడు. 'ఎన్ని పాళ్లు తిరగమంటారు చెప్పండి. తొందరగా తేలకూడదా చెప్పండీ' అన్నాడు. దాంతో గుమాస్తా శివమెత్తినట్టు లేచి కాఫీ తాగించిన విశ్వాసమన్నా లేకుండా 'నన్నుద్ధరించటానికి వొస్తున్నానా యేం, నీ కక్కుర్తికోసం నువ్వొస్తున్నావ్. పది సార్లుగాదు యిరవైసార్లు రమ్మంటే మాత్రం రావొద్దా?' అన్నాడు. దాంతో కిష్టుడు రెండు మెట్లు దిగి 'అట్లా కోప్పడితే ఎట్లా చెప్పండి, సరే అట్టాగే, సెలవు...' అంటూ మెట్లు దిగాడు.

కిష్టుడికున్న విజ్ఞానంలో, చదువులో, తెలివితేటల్లో ఆ షావుకారు గుమాస్తా ఎన్నోవంతు నిజానికి? కాని ఆ సమయంలో పడాలిసొచ్చింది. కిష్టుడి కప్పుడు తనకంటే ఇరవై రూపాయల వుద్యోగం చేస్తున్న పాకీవాడు మెరుగనిపిస్తున్నాడు. అందుకనే గుడ్డల కొట్లో గుమాస్తాపని చెయ్యటానికి వొప్పుకున్నాడు. అట్లా గుడ్డల

కోర్టులో గుమాస్తాగా వుండటం అతని కప్పుడు, నీచంగా గాని, గౌరవహానిగా గాని కనిపించ లేదు. కనుకనే చేరటానికి ఒప్పుకున్నాడు. విధి తన్నే తన్నులకి ఎంతమంది తలలు కాయలు కాయటం లేదు! కిష్టుకొక లెక్కా! నిన్నగాక మొన్న జీవితంలో ప్రవేశించాడు. నిజంగా అర్థమూ శుభమూ తెలియదుకూడా. కాని జీవిత కాలమంతాకూడా కాల రాక్షసి కర్కశపాదాల కింద నలుగుతోన్నవా రెంతమంది లేరు ప్రపంచంలో, తను తిరుగుతున్న మద్రాసు నగరం వీధుల్లో పెద్ద పెద్దగా మహాకవులుగా పరిగణింప బడి, బి.ఎ., యం.ఏ.లు పాసై ఉద్యోగాల్లేక, కడుపు కక్కుర్తి కోసం కనీసం ప్రాణాలు నిలుపుకునేందుకు మద్రాసు ఫోర్టులో బస్తాలు మోసిన వాళ్లు, కాఫీ హోటలులో సేవచేసిన వారు, రాత్రి ముష్టెత్తి అడుక్కు తిన్నవాళ్ళు ఎంత మంది లేరు. వాళ్ళందరికన్నా జీవితాన్ని తరచ లేదు కిష్టుడు. అయితే కిష్టుడు జీవితానికి వాళ్ళ జీవితానికి తేడా లుంటే వుండవచ్చు. మిగతా వాళ్లు కొన్ని ప్రత్యేక విషయాలవల్ల తమ జీవితాలని నాశం చేసుకొని వుండవచ్చు. అది వాళ్ళ దృష్టిలో నాశనం గాదు, గొప్ప అనుభవం.

కిష్టుడు బయల్దేరాడు సిమెంటు బల్లవదిలి. బజార్లగుండా నడుస్తున్నాడు. ఎక్కడికి పోతున్నాడో అతనికి తెలియదు. కాని అతనొక మేడ దగ్గరకు చేరుకున్నాడు. మేడ క్రిందభాగం అందులో అతని కొక గది కేటాయించబడి వుంది. కిష్టుడు ఆ గదిలోకి వెళ్ళి చొక్కా విప్పి కూచున్నాడు. రేపు లేదు ఎల్లుండి ఏ విషయమూ తేల్చుకోవాలి చీనాబజారు షావుకారుతో.

తులశమ్మ కిష్టుడి గది దగ్గర కొచ్చి 'లే అబ్బాయి భోజనానికి' అంది.

కిష్టుడు 'యిప్పుడు ఆకలి కావటం లేదు పిన్నీ, తరవాత లేస్తాలే, బాబాయిని కానిమ్మను' అన్నాడు.

'మీ బాబాయిగారు ఆఫీసు కెళ్ళారెప్పుడో, నాకు పనుంది తొరగాలే. తరవాత పనిలో తీరిక చిక్కదు' అంది.

విధిగా లేచి భోజనం చేశాడు కిష్టుడు. అతనికి భోంచేస్తున్నానని గాని, అందువల్ల తృప్తిగాని ఏమీ లేకపోతోంది. ఈమధ్య కిష్టుడు చేసే ప్రతి పనీ విధిగా, తప్పనిసరై చేయటం తప్ప మనస్ఫూర్తిగా చేయటం లేదు.

కిష్టుడు శంకరయ్యగారింట్లో వుంటూ వుద్యోగం వెతుక్కుంటున్నాడు. బి.ఏ. పాసైన వ్యక్తికి మద్రాసు మహానగరంలో వుద్యోగం దొరక్కపోతుందనే అపనమ్మకం లేదతని కంతకు ముందు, అప్పటికీకూడా. కాని యథార్థంగా వుద్యోగాల వేటకు బయల్దేరి అనేక సార్లు తప్పిపోయాడు. అవి ఆధ్యాత్మవాదుల సిద్ధాంతం ప్రకారం అదృష్టం కలిసిరాక పోవటం కానీయండి, మరేమైనా కానీండి. కిష్టుడి ప్రయత్న లోపంమాత్రం ఈషణ్మాత్రమూ లేదు.

కిష్టుడు రోజూ తినటం, తిరగటం వుద్యోగం లేకుండా వుండటం వాళ్లకి ఏ విధమైన ఆదా లేకపోగా ఒక్కమనిషి వారపు తిండి దండగ అవుతూవుంది. ఈ అంచనా మొదట్లో ఎవరూ వేయలేకపోయారు కాని, రోజులుగడచినకొలదీ, కిష్టుడి ప్రయత్నం ఏరోజు కారోజు ప్రయత్నంగానే స్తంభించిపోతూ వుండటంవల్ల, కుటుంబంలో అతనివల్ల కలిగే నష్టం కళ్లకు కనిపించింది మొదట తులశమ్మకు. అందుకనే మొదట కిష్టుడిపైన వుండే గౌరవం రోజు రోజుకూ దిగజారుతూ వచ్చింది. కిష్టుడు బి.ఏ. పాసైవుంటే వుండొచ్చు. కాని ఉద్యోగంలేకుండా తిరుగుతూండటంవల్ల అతనిమీద వారికి గౌరవం తగ్గుతోంది. యథార్థానికి ఒస్తే మొదట కిష్టుడి తెలివి తేటల్ని బట్టి, డిగ్రీని బట్టి ఏదో గొప్పగా సంపాదిస్తాడని, శంకరయ్యకు పట్నంలో కాస్త చేదోడు వాదోడుగా వుంటాడనీ, మంచికి చెడ్డకు అక్కరకు ఒస్తాడు, ముఖ్యంగా ఆసరాగా నాలుగాళ్లు వెనక వేసుకోవచ్చని వారి తొలకరి ఊహాగానం. కాని కిష్టుడికి వుద్యోగం దొరక్కపోవటంతో అంచనాలు అంతర్ధానమయినాయి. వ్యవహారం ఎదురుతిరిగింది. ఎప్పుడైతే తులశమ్మకు ఈ అభిప్రాయం కలిగిందో ఆనాడే శంకరయ్యకూడా తెలిసింది. మొగుడూ పెళ్ళాలన్నాక తెలియకండా పోతుందా మరి?

ఆరోజు రాత్రి, అర్ధరాత్రప్పుడు తులశమ్మ శంకరయ్యతో చెబుతూండగా విన్నాడు కిష్టుడు: 'మరీ ఏం మనిషండీ మడ్డి మనిషి! సమయానికి స్నానం చేయడు పాంలేదు, తినటంలో మాత్రం ఆకలి కాలేదు కాలేదంటూనే సోలెడు బియ్యపు అన్నానికి సమాధానం చెబుతాడు తేలిగ్గా. మరీ చచ్చిపోతున్నాం రేషన్ చాలక. బ్లాక్ మార్కెట్టులో కొనలేక. నా మాట విని తొరగా విరగడ చేసుకునే వుపాయంతో లేకపోతే కొంప మునిగిందన్న మాటే, ఎన్నాళ్లు మేపుతూ వుంటాం చెప్పండి' అంది.

గదిలో ఏమీ తోచక నిద్రపట్టక, ఆలోచిస్తూ చూచున్న కిష్టుడికి ఈ మాటలు బాకుల్లా గుచ్చుకున్నయ్. అప్పుడనుకొన్నాడు తన పిన్ని ఇంత లేకిమనిషేమా అని. ఆ తరవాత శంకరయ్య ఏం అన్నాడో కిష్టుడు వినలేదు. ఆమె మాటలకే బాధపడి, గుండెలు పగిలిపోయే బరువుతో, వచ్చే వచ్చే ఏడుపును కను రెప్పలతో, పెదవులతో ఆపుకుంటూ, గది తలుపు గడియవేసి బయల్దేరాడు. అప్పుడే అర్ధరాత్రప్పుడు. కిష్టుడు తలుపులు చప్పుడు చేయటం విన్న తులశమ్మ ఏమీ విననట్టుగానే వుంది.

కృష్ణారావు ఏమస్తో లైట్ల నీడల్లో నడుస్తున్నాడు ఒంటరిగా. సముద్రపు ఒడ్డుకు వెళ్ళాడు. రాత్రి హోరుమంటూ, ఎగసిపడే తరంగ కంపనానికి పులకరించే చీకటిని చీల్చుకొంటూ వున్న సముద్రపు ఒడ్డుకు చేరుకున్నాడు. సువిశాలమైన అగాధమైన సముద్రంలోని హోరుమనే అలజడిని చూస్తుంటే అతనిలోని అలజడి అంతర్ధానమై శాంతినిచ్చింది. సముద్రం శాంతినికేతనంలా ఎంత మంది బాధా హృదయాల్ని తృప్తి పరుస్తోందో రోజూ. ఎంతమంది, ఎన్ని రకాల వేదనల్ని, బాధల్ని, గాథల్ని, రోదనల్ని ఈ సముద్రపు గాలి జీర్ణం చేసుకోలేకపోతే యింత మంది ప్రజలు ఈ సముద్రపొడ్డు కొస్తారు నిజానికి? మానవుడెవడైనా ఒక పని చేస్తున్నాడంటే దానివల్ల ఏదో వ్యక్తిగతంగానో, సమష్టిగా గానీ లాభం లేకపోతే ఎందుకు చేస్తాడు? కిష్టుడు సముద్రపు రొదలో, వెన్నెట్లో చెలియలి కట్టమీద పడి నిద్రపోయినాడు. ప్రాణం, బాధ శ్రమ అన్నీ ఎటుపోయాయో తెల్లవారి లేచే వరకూ.

తెల్లవారగానే యింటి సంగతి జ్ఞాపకం వచ్చిందతనికి. కానీ వెంటనే చీదరకూడా పుట్టింది. అలాంటి సంకుచిత మనస్తత్వం కలవారితో వుండడం చాలా కష్టం, ప్రమాదం కూడా.

ఉదయం అయ్యర్ హోటల్లో కాఫీ తాగుతూండగా ఒక సినిమా వ్యక్తితో పరిచయం ఏర్పడ్డది. అతనంతట అతనే—ఎవరు? ఏవూరు? అని ప్రశ్నించటం ప్రారంభించాడు. అతని మాటు బూటు చూసి చెప్పాడు కిష్టుడు.

'రాండి' అన్నాడు అతను.

'ఎక్కడికి?' అన్నాడు కిష్టుడు.

'స్టుడియోకి'

'ఎందుకూ?'

'ఊరికెనే — చూద్దురుగాని'

కిష్టుడికి ఎన్నాళ్ళనుండో స్టుడియో చూడాలనీ, సినిమా షూట్ చేసేప్పుడది చూడాలనీ మహా ఆసక్తిగా వుండేది.

'సరే' నని అతనితో పాటు బయల్దేరాడు కిష్టుడు.

ఇద్దరూ స్టుడియోకి వెళ్ళారు. అతను కిష్టుడికి అన్నీ చూపించాడు. కిష్టుడికి ఆశ్చర్యంగానే వుంది యింకా.

'ఇవ్వాళ రాత్రికి మీరు ఎక్స్ట్రాగా వుంటారా' అన్నాడతను.

'ఎవరు నేనా' అన్నాడు కిష్టుడు.

'అవును మీరే'

'ఎందుకు?'

'వేషం వేసేందుకు.'

'నాకేం చాతవును, నాకు చేతకాదు' అన్నాడు.

'చాతయ్యేందుకు ఏముంది, ఏం చెయ్యనవసరం లేదు. వూరికే కుర్చీలో రాజువేషం వేసుకొని కూచోటమే' నన్నాడు.

కిష్టుడికి యిదొక అదృష్టంగా వుంది. ఎటు తిరిగి ఎటొచ్చినా తాను సినిమాలో నటించినవాడవుతాడనుకొని 'సరే' నన్నాడు.

ఆ రాత్రి కిష్టుడికి రంగుపూసి షూట్ చేశారు. కిష్టుడికి పరమానంద మయింది. తెల్లవారి తనను

తలుపుకొన్న మేనేజరు వచ్చి పది రూపాయలు చేతిలో పెట్టి 'వెళదామా' అన్నాడు.

'ఆ' అన్నాడు కిష్టుడు.

యిద్దరూ బయల్దేరారు.

కిష్టుడు నవ్వులో అడిగాడు 'రేపుకూడా రమ్మంటారా?' అని.

'అవసరం లేదు, రాత్రితో అయిపోయింది ఆ పాటు' అన్నాడతను.

'పోనీ మరో పనేదైనా యిప్పించండి చేస్తా' నన్నాడు.

'మా స్టుడియోలో ప్రస్తుతం ఖాళీలు లేనందున విచారిస్తున్నాం, ఎప్పుడన్నా అవకాశం వుంటే తెలుపుతాం' అని అడ్రసు రాసుకున్నాడు.

పదిరూపాయలు కొంత వరకూ ఖర్చులకు సరిపోతాయనే సంతృప్తివున్నా వుద్యోగం కోసం బయల్దేరాడు కిష్టుడు.

చినాబజారు షావుకారు తనను రమ్మంది ఆరోజే. వెంటనే జ్ఞాపకంవచ్చి బయిల్దేరాడు అక్కడికి.

కొట్లోకి పోబోతుండగా గుమాస్తా కనిపించి 'మీరా, క్షమించండి, మీ బదులు మరొకర్ని వేసుకొన్నాం నిన్న' అన్నాడు.

'మరి నాకిస్తానంటివిగాదా?' అన్నాడు కిష్టుడు దిక్కు మొగంతో.

'అవును యిస్తామన్నాం, కాని అతను పెద్ద రికమెండేషన్ తెచ్చాడు. అందువల్ల చేర్చుకోక తప్పిందికాదు' అన్నాడు.

కిష్టుడికి కోపం, ఏడుపు ఒక్కసారిగా వచ్చాయ్. 'నే ప్రొప్రైటరుతో మాట్లాడాలి - ఎక్కడ?' అన్నాడు.

'లేదు, వీల్లేదన్నాడు' మేనేజరు.

దూరంగా 'ప్రొప్రైటరు' అని రాసివుండటం చూసి ఆ గదిలోకి పోయాడు కిష్టుడు.

కిష్టుణ్ని జూసి 'ఏంపని మీద వొచ్చావు' అన్నాడు. కిష్టుడు ప్రాధేయ పూర్వకంగా అడిగాడు: 'వుద్యోగం యిప్పించండి. యాభైరూపాయలుచాలు, పోనీ నలభైచాలు,-కనీసం ముప్పై. లేకపోతే బాఖర్చుల కియ్యండి పని చేస్తాను' అని.

ప్రొప్రైటరు కిష్టుడి వంకజూసి 'ఖాళీల్లేవయ్యా అంటే ఎందుకట్టా గొంతు బించుకొంటావు. వెళ్లు' అన్నాడు చీదరగా.

కిష్టుడు కదలకండా యింకా బతిమాలుతున్నాడు 'మోకాళ్లు పట్టుకుంటాను,' ఏదో ఒక పనివ్వండి చాలు, ముప్పై చాలు, బ్రతికితే చాలు' అని కన్నీళ్లు పెట్టుకుని ప్రార్థించాడు.

ప్రొప్రయిటరు ప్యూన్ పిలిచి 'ఈ పీనుగని బైటకు నెట్టు' అన్నాడు.

కిష్టుడి నెత్తురు కళ్లల్లోకి ప్రాకింది. ఎర్రగా జ్యోతుల్లాగా వెలుగుతోన్న కళ్ళతో 'సరే' నని వెళ్ళిపోయాడు.

ఆ కోపంతో కనపడ్డ ప్రతి ఆఫీసు, ప్రతి కంపెనీ ఎక్కుతూదిగుతూ నేవున్నాడు. ఎక్కడా ఎవరూ చేర్చుకున్న పాపాన పోలేదు. చివరకు రెండు కాఫీ హోటళ్లల్లోగూడా అడిగాడు. ఆంధ్రులకి హోటలు పని చేతగాదనీ, బద్ధకలానీ హోటల్ మేనేజర్లు వీల్లేదన్నారు.

పెద్ద పెద్ద కంపెనీల్లోను, ఆఫీసుల్లోను అవకాశంలేక చిన్న చిన్నకంపెనీలలోకి వెళ్ళాడు. వాళ్లు అన్నీ మాట్లాడి, జీతం మాట్లాడుకొని 'బి. ఏ. వాణ్ని మేం భరించలేం బాబూ' అని జారుకునే వాళ్లు

ఇంటికి పోయాడు కిష్టుడు. పోగూడదనుకొంటూనే పోయాడు. శంకరయ్య సమయానికి యింటోనే వున్నాడు. కిష్టుడి గదిలో కొచ్చిన అలికిడి విని గదిలోకొచ్చి, 'మీ అమ్మ ఉత్తరం రాసింది కదూ రమ్మని పండక్కు. పో. పోయి అక్కడే ఏదైనా ప్రయత్నించేయి బావుంటుంది. యిక్కడెందుకు అనవసరంగా డబ్బుదండగ. అదీగాక పండక్కు తులసి మేనల్లుడొస్తున్నాడు. ఈ గది నువ్వు ఖాళీ చేస్తే అతనుండటానికి వీలుంటుంది. సరే. చెప్పవలసిందేదో చెప్పాను. రాత్రికి బండి వున్నట్టుంది మీ వూరికి బయల్దేరు' అన్నాడు.

ముఖాముఖిన కుండలు బద్దలుకొట్టినట్టు చెప్పేక చాలా బాధపడ్డాడు కిష్టుడు. 'సరే' నన్నాడు మాటవరసకు. ఇక శంకరయ్య గారి నోటినుండి అన్ని మాటలొచ్చాక ఆ యింట్లో వుండటం అనవసరం. అసంబద్ధం కూడా. అందులో చదువు, సంస్కారం, విజ్ఞానం వున్న కిష్టుడు వుండగలుగుతాడా? కిష్టుడేగాదు మానవ జన్మెత్తిన ఏ ప్రాణీ వుండదు. స్వాభిమానం బాధిస్తోంటుంది ఒకవైపునుండి.

కిష్టుడు బజారుకు బయల్దేరాడు. జేబీలో తడిమి చూసుకున్నాడు ఆరురూపాయల తొమ్మిదణాలున్నయ్. వూరికి పోవటానికి అయిదు రూపాయలు కావాలి. పోతే మిగిలేది రూపాయి చిల్లర. అమ్మ గాజులు తెమ్మంది. ఏం పెట్టి తెచ్చేట్టు?

కిష్టుడు హృదయంలో మెరుపులాంటి భావం తట్టింది. బజార్లో వున్న గాంధీ సిమెంటు విగ్రహం చూసేసరికి ఈ గాంధీగారే 'సర్వోదయ' అని 'రామరాజ్యం' అని నానామాటలు చెప్పి, నానాబాధలు పెట్టాడు. దేశంలో నిరుద్యోగు లుండకూడదనీ, ప్రతివాడికీ వుద్యోగం చూపించాలనీ, ప్రతివాడూ సుఖంగా బ్రతకాలనీ నాయకుల ఆశయాల్లో వున్నాయి. కాని ఎవరు నెలకొల్పగలిగేరు?

ఆ సమయంలో కిష్టుడి కంటికి దూరంగా ఒక దృశ్యం అగుపించింది. అన్నీ ఫ్యాక్టరీలు, కొట్టాలు. పొగలు, వాటికి అవతలగా పొలాలు, వ్యవసాయదారులు, ఫ్యాక్టరీలలో కంపెనీలలో బయట బోర్డులు అగుపిస్తున్నాయి. ఉద్యోగం కావాలన్నవాళ్ళంతా దరఖాస్తులు చేసుకోవచ్చు, వెంటనే దరఖాస్తు అందాలి. ప్రతి దరఖాస్తుదారునికి రోజుకు ఆరుగంటల పని, యాభైరూపాయల జీతం, ఫ్రీక్వార్టర్సు, ఎంతమందికైనా ఖాళీలున్నాయి, త్వరపడండి, త్వరపడండి' అన్న బోర్డు ఫ్యాక్టరీలకు బయట. పొలాల్లో పనులు చేస్తూ వ్యవసాయదారులు చెయ్యెత్తి 'రాండి, మీరంతా రండి, పొలాల్లో పని చేయండి, యిదుగో మీకు, యిదుగో మీకు, అని అడిగే ప్రతివాడికీ, పొలంవైపు చూసే ప్రతి వ్యక్తికీ పిలిచి పనిస్తున్నారు వాళ్ళు. కిష్టుడికి ఆ లోకంలోకి వెళ్ళ అనిపించింది. అట్టాగే ఆ దృశ్యాల్ని చూస్తో నడుస్తున్నాడు. ఆ లోకం లోకి కిష్టుడు ఈ ధోరణిలో పోతూవుండగా ట్రాం రావటం, కొట్టుకోవటం, కిష్టుడు పడి పోవటం ఒక్కసారిగా జరిగాయి.

ఆహింసా మూర్తి చూపిస్తున్న రామ రాజ్యాన్ని, కార్మిక కర్షక శ్రామిక రాజ్యాన్ని స్వర్గరాజ్యాన్ని చూస్తూ, తలపోస్తూ, అక్కడి ఆనందాన్ని, అనుభవిద్దామని పోతూ ట్రాంక్రింద పడి పోయిన కిష్టుడు ఆస్పత్రికి చేర్చబడ్డాడు.

డాక్టరువచ్చి 'ఏం? ఎలావుంది?, అన్నాడు.

'ఎవరు మీరా? ఉద్యోగంకావాలా? రాండి ఇక్కడ అందరికీ, అడిగిన వాళ్ళందరికీ వుద్యోగా లిస్తాం మా ఫాక్టరీల్లో. అదిగో ఫాక్టరీలు చూశావా, వేలు, లక్షలు, కోట్లు ప్రపంచంలోని ప్రజలంతా వచ్చినా వుద్యోగాలిస్తాం, అందరికీ యిల్లు వూరికే దొరుకుతయ్ అక్కడ, ఒక్కరికి యాభైరూపాయల జీతం. రండి, వస్తారా? పోదాం రాండి, వుద్యోగం యిప్పిస్తాం. మేం యివ్వం మీ పని మరే చేసుకోండి, మీ క్కావలసిన డబ్బు మరే తీసుకోండి, మిమ్మల్ని బలవంతం పెట్టం మేము. ఓపికున్నంతవరకూ పనిచేయండి, కావలసినంత తీసుకోండి, తినండి, అదేం అనం ఎవరూ- మేమంతా ఒక మే-మేం కాదు మనం- రాండి వెళదాం రాండి రామ రాజ్యానికి పోదాంరండి, శాంతిసీమకు పోదాం, పోదాం పోదాం పైపైకి.' అంటూంటే డాక్టరుకు ఏమీ తోచటం లేదు ఏ తెగకి చెందిన జబ్బని. మాట్లాడుతున్నాడు, చేస్తున్నాడు. అన్ని లక్షణాలు బాగానేవున్నాయ్. అట్టా చూస్తుండ గానే కిష్టుడు మాటాపలుకూ లేకండా పడిపోయి నాడు. కిష్టుడి జేబుల్లో వెతగ్గా అతని యింటినుండి తల్లి రాసిన వుత్తరం అడ్రసు వుంది. డాక్టరు వెంటనే టెలిగ్రాం యిచ్చాడు తల్లికి.

శంకరం, తులశమ్మ వొచ్చేసరికే కిష్టుడి తల్లి, అక్క, బావ, వచ్చివున్నారు ఆస్పత్రికి. అంతా భయంగా, ఆశగా చూస్తున్నారు కిష్టుడివంక. కిష్టుడు మూసిన కళ్ళు తెరవటం లేదు. అప్పు డప్పుడు మధ్య మధ్యన పెదిమపై నాలిక ఆడు తోంది గాని ధ్వని రావటం లేదు.

'నాన్నా, బాబూ, కిష్టా చూడు, నాన్నా చూడు, బుజ్జీ చూడు' అంటూ తల్లి కిష్టుడిమీద పడి ఏడుస్తూ పలకరిస్తోంది. మిగతా వాళ్ళంతా విచారంగా చూస్తున్నారు.

డాక్టరు యింజక్షన్లు యిస్తూనే వున్నాడు ఎడతెరిపి లేకుండా. కాని కిష్టుడు స్పృహలో లేడు. మూసిన కన్ను తెరవటం లేదు.

కిష్టుడు చివరిసారిగా 'ఉద్యోగం-ఉద్యోగం' అని పెద్దగా అని కళ్ళుమూశాడు.